

## న్యూస్‌రీల్

### ఆడపడుచులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు


ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి మహిళా ఆర్థికంగా బలపడాలి.. సమాజంలో గౌరవంగా బతకాలి.. మహిళలందరి ముఖంలో చిరునవ్వు ఉండాలన్న సంకల్పంతో రాష్ట్రంలో మహిళల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వారికి పెద్దపీట వేశారన్నారు. కుటుంబ నిర్మాణం నుంచి దేశ నిర్మాణం వరకు మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. పేద విద్యార్థుల చదువుల కోసం తల్లులకు ఆర్థిక సాయం దిశగా అమ్మఒడి, మహిళల భద్రతకు దిశ చట్టాన్ని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు వైఎస్సార్ చేయూత, కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు కాపు నేస్తం వంటి పథకాలను పక్కాగా అమలు చేస్తున్నట్లు గుర్తు చేశారు.

### రక్తదానం.. అభినందనీయం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

తిరుపతి అలిపిరి : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉద్యోగులు రక్తదానం చేయడం అభినందనీయమని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి ప్రశంసించారు. మంగళవారం తిరుపతిలోని కేంద్రీయ ఆస్పత్రిలో రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈఓ మాట్లాడుతూ మహిళా ఉద్యోగులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జేఈఓలు సదా భార్గవి, వీరబ్రహ్మం, ముఖ్య వైద్యాధికారి మురళీధర్ , సంక్షేమ విభాగం డిప్యూటీ ఈఓ స్నేహలత, ఆర్ఎంఓ నర్మద పాల్గొన్నారు.

### 10న ఆర్టీసీ దుకాణాలకు టెండర్లు

తిరుపతి అర్బన్: జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్లలో ఖాళీగా ఉన్న దుకాణాలను అద్దెకు ఇచ్చేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 89 దుకాణాలు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా డిపో మేనేజర్ కార్యాలయంలో ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం 2గంటల వరకు దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని, నిర్దేశిత రుసుము చెల్లించి పొందవచ్చని సూచించారు. తిరుపతి జిల్లా ప్రజా రవాణా కార్యాయంలో ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్‌లో దరఖాస్తులను వేయాలని కోరారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు బాక్స్ ఓపెన్ చేసి దరఖాస్తులు పరిశీలించనున్నట్లు వెల్లడించారు. ఆర్టీసీ నిబంధనల మేరకు టెండర్ ఖరారు చేస్తామని వివరించారు.

# స్త్రీరస్తు.. శుభమస్తు

ఆకాశంలో సగం.. ఆడదే ఆధారం.. ఆమే అన్నింటికీ మూలం.. అంటూ ఉన్నతంగా మహిళలను అందరూ కీర్తిస్తూ ఉంటారు. కానీ, కొందరు పురుషులు మాటలకే పరిమితమై స్త్రీలను వంటింటి కుందేళ్లుగా మార్చేస్తుంటారు.. మరికొందరు రాజకీయ నేతలు కేవలం ఓటర్లుగానే ఆడవాళ్లను పరిగణిస్తున్నారు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. విప్లవాత్మకమైన పథకాలను ప్రవేశపెట్టి అండగా నిలిచారు. పదవుల్లోనూ.. పాలనలోనూ ఆమెకు అగ్రపీఠం వేశారు. ప్రభుత్వం అందించిన అవకాశాలను మహిళలు సైతం అందిపుచ్చుకున్నారు. నిర్దేశించిన లక్ష్యాలను అధిగమిస్తూ అద్భుతాలు సృష్టిస్తున్నారు.. జిల్లాను ప్రగతి పథంలో నడిపించడంలో తమ వంతు పాత్రను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

- మహిళలకు అగ్రపీఠం వేసిన ప్రభుత్వం
- ఆర్థికాభివృద్ధికి అనేక పథకాలు
- రాజకీయ పదవుల్లోనూ అధిక ప్రాధాన్యం
- అవకాశాలను అందిపుచ్చుకుంటూ..
- ప్రగతి పథంలో పయనిస్తున్న పడతులు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

సాక్షి, తిరుపతి : మహిళలు అబలలు కాదు, సబలలని, అవకాశం ఇస్తే ఇంటినే కాదు సమాజాన్నీ అభివృద్ధి దిశగా పరుగులు పెట్టించగలరని నిరూపిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుంటూ విజయపథంలో పయనిస్తున్నారు. మంత్రులుగా, మేయర్లుగా, మున్సిపల్ చైర్లన్లుగా, ఎంపీపీలుగా, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులుగా, సర్పంచ్‌లుగా తమ సత్తా చాటుతున్నారు.

**మహిళలదే ఆధిక్యం**

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 32,97,484 మంది ఓటర్లు ఉంటే, అందులో మహిళా ఓటర్లు 16,65,222 మంది ఉన్నారు. ప్రతి ఎన్నికల్లోనూ వారి ఓట్లే విజయావకాశాలను ప్రభావితం చేస్తుంటాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిర్వహించిన కార్పొరేషన్, మున్సిపల్, పరిషత్, పంచాయతీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. అందులో ఎన్నికైన ప్రజాప్రతినిధుల్లో మహిళలే అధికం. ఎన్నికలు జరిగిన స్థానాల్లో మహిళలు ఇచ్చిన తీర్పుతోనే పలువురు అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుపొందారు. ఓటింగ్ ద్వారా విజయం సాధించిన వారిలోనూ మహిళలే ఎక్కువ మంది ఉన్నారు. తిరుపతి, చిత్తూరు నగర మేయర్లుగా డాక్టర్ శిరీష, అముద బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నామినేటెడ్ పదవుల్లోనూ స్త్రీలకే ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పించింది. అందులో భాగంగా కేజే శాంతికి ఈడిగ కార్పొరేషన్ చైర్మన్, వనితకు వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ పదవులను ఇచ్చి గౌరవించింది. అలాగే వివిధ కార్పొరేషన్లకు డైరెక్టర్లుగా సైతం ఎక్కువ మంది మహిళలకే అవకాశమిచ్చింది.

**కొండంత అండగా ప్రభుత్వం**

కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో పనులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలకు బ్యాంకు లింకేజీతోపాటు సున్నా వడ్డీ , వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా వంటి పథకాల ద్వారా ప్రభుత్వం కొండంత అండ నిలబడింది. పొదుపు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ప్రవేశపెట్టిన ప్రతి పథకంలోనూ మహిళలనే ప్రధాన లబ్ధిదారులుగా చేర్చింది. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో నేడు ఎంతో మంది చిరు వ్యాపారాలు ప్రారంభించి లాభాలు ఆర్జిస్తూ కుటుంబానికి చేదోడుగా నిలుస్తున్నారు. అలాగే బిడ్డల చదువుకు ఇబ్బంది లేకుండా తల్లుల ఖాతాల్లో ఏటా అమ్మఒడి పథకం కింద రూ.15వేలు జమచేస్తోంది. ఈ పథకం ఎందరో పేద పిల్లలను బడి బాట పట్టించింది. సర్కారు బడులను పూర్వవైభవం తీసుకువచ్చింది.

అద్దె ఇళ్లతో అవస్థలు పడుతున్న నిరుపేద మహిళలకు సొంత గూడు కల్పించేందుకు ప్రభుత్వం వేలాది రూ.కోట్లు వెచ్చించింది. మహిళల పేరుతో ఇంటి పట్టాలు మంజూరు చేయడమే కాకుండా, పక్కా గృహాలను సైతం నిర్మించి ఇస్తోంది.

**దశ'దిశ'లా రక్షణ**

తెలంగాణలో జరిగిన దిశ ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే స్పందించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ×దిశ¥ చట్టాన్ని తీసుకొచ్చారు. స్త్రీల రక్షణకు ప్రత్యేక యాప్‌ను ప్రారంభించారు. బాధిత మహిళకు సత్వర న్యాయం అందేలా పోలీసు, న్యాయ వ్యవస్థను బలోపేతం చేశారు. మహిళలకు ప్రత్యేకంగా పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. మిగిలిన పోలీస్‌స్టేషన్లు సమన్వయం చేసేందుకు ప్రత్యేకంగా ఐపీఎస్ అధికారికి బాధ్యతలు అప్పగించారు. క్షేత్రస్థాయిలోనూ అండగా ఉండేందుకు గ్రామ/వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి అందులో మహిళా పోలీసులను నియమించారు.

### ఆకాశమే హద్దుగా..



ఎక్కడో భాకరాపేటలో పుట్టిన నేను పురుషాధిక్యం ఉన్న సినీ, రాజకీయం రంగాల్లో విజయం సాధించానంటే నాపై నాకున్న నమ్మకంతో ధైర్యంగా ముందడుగు వేయడం, అలా ముందుకు వెళుతున్న నన్ను నా అన్నలు, భర్త, కుమారుడు వెన్నంటి ఉంటూ ప్రోత్సహించారు. నేడు నా సక్సెస్ వెనుక 30 ఏళ్ల శ్రమ ఉంది. ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి జగనన్న రాష్ట్రంలో మహిళలకు ఉన్నత స్థానం కల్పించారు. ప్రతి సంక్షేమం మహిళకే చెందేలా పథకాలు అమలుచేస్తున్నారు. ప్రతి విభాగంలోనూ పురుషులకు సమానంగా మహిళకు అవకాశం కల్పిస్తున్నారు. నేడు మంత్రిగా పది మందికీ సేవచేసే అవకాశం నాకు కలిగిందంటే అది ముఖ్యమంత్రి జగనన్న ఇచ్చిన ప్రోత్సాహమే. మహిళాసాధికారతను మాటల్లోగాక చేతల్లో చూపుతున్న జగనన్నకు మహిళల తరఫున సలాం చేస్తున్నా.

– ఆర్కేరోజా, పర్యాటక శాఖ మంత్రి

### మహిలోసుమతి

ఓర్పునకు మారుపేరు ఆమె
ఓదార్పునకు చిరునామా ఆమె
పాలనకు సై అంటుంది ఆమె
ప్రక్షాళన దిశగా సాగుతోంది ఆమె






### జగనన్నతో మహిళా సాధికారత



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మహిళా సాధికారత సాధించే దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాల్లో అగ్రస్థానంలో నిలిపారు. వైద్యురాలిగా ఉన్న నన్ను ఎమ్మెల్యే భూమన సహకారంతో తిరుపతి నగర తొలిమేయర్‌గా ఎంపిక చేశారు. బీసీ అయిన నన్ను జనరల్ మహిళ కేటగిరిలో పోటీకి దింపి మేయర్‌గా గెలిపించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తుండడం వెనుక జగనన్న చారిత్రక నిర్ణయాలే కారణం. అమ్మాయిలూ.. చదువుతోనే అసమానతలను దూరం చేయొచ్చు. ప్రతి విద్యార్థిని చదువుపట్ల శ్రద్ధ వహించాలి.

– డాక్టర్ శిరీష, తిరుపతి నగర మేయర్

### కట్టెలమ్మిన చోటే.. ప్రథమ పౌరురాలిగా!



నాకు 11 ఏళ్లప్పుడు మా అమ్మానాన్న ఇద్దరూ చనిపోయారు. అక్క నాగభూషణం, తమ్ముడు మేఘనాథం, చెల్లెలు బుజ్జి ఉండేవాళ్లం. మా అక్కే మమ్మల్ని పెంచింది. అడివికి పోయి కట్టెలు కొట్టి మోసుకొచ్చి అమ్మితే రూ.20 వచ్చేది. చాలాసార్లు ఆకలితో పడుకున్న రోజులు కూడా ఉండాయి. మా వీధికి తప్ప నేను ఎవరికి కూడా తెలీదు. కేవలం ముఖ్యమంత్రి జగనన్నను చూసి నాకు ఓట్లు వేశారు. కార్పొరేటర్ అయినాను. ఓరోజు మంత్రి పెద్దిరెడ్డి అన్న ఫోన్‌చేసి కార్పొరేటర్ కన్నా పెద్దపోస్టు ఇస్తా పనిచేస్తావా అమ్మా..? అని అడిగినారు. నాపై నమ్మకంపెట్టి మేయర్ చేసినారు. ఇదంతా జగనన్న దయ.

– అముద, చిత్తూరు నగర మేయర్

**సంక్షేమ పథకాల సమాచారం**

| పథకం | లబ్ధిపొందుతున్న మహిళలు | ఏటా అందిస్తున్న నిధులు |
|---|---|---|
| అమ్మఒడి | 1,52,743 | రూ.475.15 కోట్లు |
| వైఎస్సార్ ఆసరా | 5,57,958 | రూ.579.74 కోట్లు |
| వడ్డీలేని రుణాలు | 68,440 | రూ.155.23 కోట్లు |
| ఇంటి స్థలాలు/ఇళ్ల నిర్మాణాలు | 1,74,837 | రూ.1438.54 కోట్లు |

### శోభాయమానం.. సప్త ప్రదక్షిణం





తిరుమల శ్రీవారి వార్షిక తెప్పోత్సవాలు మంగళవారంతో పరిపూర్ణమయ్యాయి. ఈ సందర్భంగా ఐదో రోజు శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామివారు విద్యుద్దీపాలు, విశేష పుష్పాలతో అలంకరించిన తెప్పలపై కొలువుదీరారు. భక్తుల గోవిందనామస్మరణల నడుమ పుష్కరిణిలో ఏడు ప్రదక్షిణలు చేస్తూ అనుగ్రహించారు. దేవదేవేరుల దివ్యతేజస్సును వీక్షించి జనులు పులకితులయ్యారు. – తిరుమల

### మనోనేత్రంతో దర్శించితిమి దేవా!




శ్రీవారి దర్శనానంతరం ఆలయం వెలుపల ప్రత్యేక ప్రతిభావంతులు

తిరుమల శ్రీవారిని మంగళవారం సుమారు 400 మంది అంధ విద్యార్థులు, ప్రత్యేక ప్రతిభావంతులు దర్శించుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీ అష్టోత్తర శతచుక్కల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారు మంగళవారం తిరుమల చేరుకుని స్వామివారిని సేవించి పులకించారు. సరికొత్త అనుభూతి పొందినట్టు ఆనందం వ్యక్తం చేశారు. ట్రస్టు వ్యవస్థాపకులు వేణు, ఇతర టీటీడీ అధికారులు పాల్గొన్నారు. – తిరుమల



### వైఎస్సార్‌సీపీతోనే బీసీలకు న్యాయం


ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

రేణిగుంట : బీసీలను టీడీపీ కేవలం ఓటు బ్యాంకుగానే చూసిందని, వైఎస్సార్‌సీపీతోనే వెనుకబడిన వర్గాలకు న్యాయం జరుగుతోందని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం రేణిగుంటలో ఆయన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తరపున ప్రచారం నిర్వహించారు. పార్టీ నేతలతో కలిసి ర్యాలీగా గ్రాడ్యుయేట్ల ఇళ్లకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు టి.సంధ్య, వైస్ ఎంపీపీ సుజాత, పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్‌లు నగేషం, గంగారి రమేష్, జువ్వల దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### దరఖాస్తు చేసుకోండి

కోట: జిల్లాలోని బీసీ గురుకుల పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ నారాయణరావు మంగళవారం పేర్కొన్నారు. తిరుపతి జిల్లా పరిధిలో కోట 120, దొరవారి సత్రం 80, సత్యవేడు 80, ఐతేపల్లి 40, వెంకటగిరి బాలుర పాఠశాలలో 40, గూడూరు 40, ఉదయమాణిక్యం బాలికల పాఠశాలలో 80 సీట్లు ఖాళీగా ఉన్నాయని, విద్యార్థులు ఏప్రిల్ 4లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### చోరీ కేసులో ముగ్గురికి రిమాండ్

తిరుపతి లీగల్ : చోరీ కేసులో ముగ్గురికి ఈనెల 21వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఫిబ్రవరి 1వ తేదీన కరకంబాడిలో వి.అంకయ్య అనే వ్యక్తి ఇంటిలో రూ.3.90లక్షలు అపహరణకు గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. తిరుపతి మంగళంకు చెందిన శేతుదిలీప్‌కుమార్ అలియాస్ తంబి, కె.త్యాగరాజ్, ఎం.పురుషోత్తంను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు.

# గెలుపే లక్ష్యం.. మెజారిటీ ముఖ్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, సమావేశానికి హాజరైన నేతలు, కార్యకర్తలు

చంద్రగిరి : వైఎస్సార్‌సీపీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం తొండవాడ సమీపంలోని నారాయణి గార్డెన్స్‌లో ప్రజాప్రతినిధులు, నేతలతో సమావేశం నిర్వహించారు. చెవిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన ఎమ్మెల్సీ అభ్యర్థులకు అత్యధిక మెజారిటీ తీసుకువచ్చేందుకు కృషి చేయాలని కోరారు. ఈనెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులుగా ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరినీ వెంటబెట్టుకుని శ్యాం ప్రసాద్‌రెడ్డికి ఓటు వేయించాలన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయుల తరపున పోటీ చేస్తున్న పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అత్యంత నమ్మకస్తుడు, విద్యావంతుడు, తన ట్రస్టు ద్వారా ఎంతో మందికి సాయం చేస్తున్న పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డికి ఓటు వేయడం వల్ల పట్టభద్రుల అందరికీ మంచి జరుగుతుందన్నారు.

**ఎంఎల్‌సీల గెలుపు కోసం 10న చంద్రగిరిలో బహిరంగ సభ**

వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపుకోసం ఈనెల 10వ తేదీ శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు చంద్రగిరిలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించి జగనన్నకు కానుకగా ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ సభ ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. గృహసారథులు, పట్టభద్రులు, కార్యకర్తలు, నేతలు పెద్ద ఎత్తున తరలివచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు


టీడీపీ నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఏర్పేడు : మండలంలోని మోదుగులపాళెం గ్రామానికి చెందిన 25 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. మంగళవారం శ్రీకాళహస్తిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ సర్పంచ్ రంగయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయతో తన కుమారుడికి సచివాలయ ఉద్యోగం వచ్చిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి, స్థానిక నేతలు రాజేంద్ర, సురేఖ, కృష్ణయ్య, చెంగయ్య, శ్రీహరి రాయల్, సుందరయ్య, మంగయ్య, గురవయ్య పాల్గొన్నారు.

**సొంతగూటికి చేరిన యువత**

శ్రీకాళహస్తి : పట్టణంలోని 33 వార్డుకు చెందిన యువకులు మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇటీవల తమను టీడీపీ నేత సత్రవాడ ప్రవీణ్ మభ్యపెట్టి ఊరందూరుకు తీసుకెళ్లి బొజ్జల బృందమ్మ చేతుల మీదుగా ఆపార్టీ కండువాలు కప్పేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే వెంటనే ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని కలిసి పరిస్థితి వివరించామన్నారు. ఆయన తమ బాధను అర్థం చేసుకుని ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరచిని అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారని వివరించారు. జగన్ చారిటబుల్ ట్రస్టు పెట్టినప్పటి నుంచి తాము ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితోనే ఉన్నామని, అందుకే సొంతగూటికి రావడం ఆనందంగా ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో భరత్‌రెడ్డి, మున్నా రాయల్, జయశ్యామ్ రాయల్ పాల్గొన్నారు.

# నిబంధనల మేరకే ఎన్నికలు


మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు, కలెక్టర్

తిరుపతి అర్బన్ : నిబంధనల మేరకే ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల పరిశీలకులు కాటమనేని భాస్కర్, కోనా శశిధర్ ఆదేశించారు. మంగళవారం తిరుపతిలోని పద్మావతి వర్సిటీలో మైక్రో అబ్జర్వర్లకు ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. ప్రిసైడింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ మైక్రో అబ్జర్వర్లు విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో జరిగే విషయాలను పరిశీలిస్తూ నివేదిక సిద్ధం చేసి సీల్డ్ కవర్‌లో నోడల్ అధికారికి అందించాలని స్పష్టం చేశారు. పోలింగ్ సమయంలో బయటి వ్యక్తులు అందించే ఆహారపదార్థాలను తీసుకోకూడదని ఆదేశించారు. శశిధర్ మాట్లాడుతూ విధులు కేటాయించిన తర్వాత మైక్రో అబ్జర్వర్లు ఎట్టి పరిస్థితులలో గైర్హాజరు కాకూడదని తెలిపారు. ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల పరిశీలకులు సూచనలను మైక్రో అబ్జర్వర్లు పాటించాలన్నారు. జేసీ డీకే బాలాజీ, అడిషనల్ ఎస్పీ కులశేఖర్, డీఆర్‌ఓ శ్రీనివాసరావు, విశ్రాంత జేసీ చంద్రమౌళి పాల్గొన్నారు.



# గరుడునిపై కల్యాణ వెంకన్న


గరుడవాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. మంగళవారం సాయంత్రం పౌర్ణమి సందర్భంగా గరుడవాహన సేవను వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో ఊంజల్‌సేవను చేశారు. అనంతరం రాత్రి దేవదేవేరులు గరుడవాహనంపై ఆశీనులై మాడవీధుల్లో విహరించారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్ వెంకటస్వామి, ఆలయ ఇన్‌స్పెక్టర్ అనిల్, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.



### బిడ్డతో సహా తల్లి ఆత్మహత్య

– వరకట్న వేధింపులే కారణం


భర్త, కుమారుడు దేవాన్ష్‌తో మహేశ్వరి (ఫైల్)

పాకాల: బిడ్డతో సహా తల్లి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ నరసప్ప కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు తెలిపారు.అనంతపురం జిల్లా, వెలుగప్ప మండలం, జీడిపల్లెకు చెందిన నాగేంద్ర భార్య మహేశ్వరి(30)తో కలిసి ఎస్ఆర్ పురం మండలం, డీఆర్‌డీఓలోని జిందాల్ సంస్థలో పనిచేస్తూ అక్కడే తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో నివాసం ఉంటున్నాడు. ఈనెల 6న తన భార్య కనిపించడంలేదని ఎస్సార్‌పురంలో నాగేంద్ర ఫిర్యాదు చేశాడు. ఇంతలో మండలంలోని నేంద్రగుంటకు సమీపంలోని చెరువులో తల్లి, బిడ్డ మృతదేహాలు ఉన్నట్టు సమాచారం అందగా.. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వాటిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. తల్లి తన చున్నీతో 14 నెలల కుమారుడు దేవాన్ష్‌ను నడుముకి కట్టుకుని చెరువులో దూకి ఆత్మకు పాల్పడినట్లు గుర్తించామన్నారు. అక్కడే ఉన్న బ్యాగు, సెల్ ఫోన్ ఆధారంగా మృతురాలు నాగేంద్ర భార్యగా గుర్తించి సమాచారం అందించినట్టు తెలిపారు.

**మా అక్క మృతికి వరకట్న వేధింపులే కారణం**

తిరుపతి సమీపంలోని ఓ ప్రయివేటు కళాశాలలో చదువుతున్న మృతురాలు మహేశ్వరి సోదరుడు నరేంద్ర పాకాలకు చేరుకుని తన అక్క చావుకు వరకట్న వేధింపులే కారణమని ఆరోపించారు. మహేశ్వరి ప్రస్తుతం మూడు నెలల గర్భవతి అని, ఆమెను చిత్ర హింసలకు గురిచేసి ఆత్మహత్య చేసుకునేలా చేశారని బోరున విలపించాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రాజశేఖర్ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

### వేర్వేరుచోట్ల ఆరుగురు ఎర్రదొంగల అరెస్ట్


పట్టుబడ్డ ఎర్రచందనం చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తిరుపతి అలిపిరి : శేషాచలం అటవీప్రాంతంలో సోమవారం రాత్రి వేర్వేరుచోట్ల నిర్వహించిన కూంబింగ్‌లో 23 ఎర్రచందనం దుంగలు, 3 బైక్‌లు స్వాధీనం చేసుకుని ఆరుగురు స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. మంగళవారం వారు తిరుపతి టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో మాట్లాడుతూ ఆర్ఐలు కృపానంద, చిరంజీవులు ఆధ్వర్యంలో కూంబింగ్ చేపట్టామన్నారు. ఆర్ఎస్ఐ ఆలీబాషా బృందం అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు, బాలపల్లె బీట్ పరిధిలో ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతున్న ముగ్గురిని పట్టుకున్నారని తెలిపారు. వీరి నుంచి ఒక మోటారు సైకిల్, 11 దుంగలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు మణికంఠ (28), కోలం వెంకట శేషయ్య (32), కూని వెంకటేశ్వర (21)గా గుర్తించామని వెల్లడించారు. ఆర్ఎస్ఐ టి.రాఘవేంద్ర టీమ్ వైఎస్సార్ కడప జిల్లా పాతూరు కుంట సమీపంలో డంప్ చేసిన 12ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితులు అన్నపు నరసింహులు(39), డబ్బుగోడ్డు లక్ష్మీ నరసయ్య (47), గొర్ల రాము (45)గా గుర్తించామని వివరించారు. . వీరి నుంచి రెండు మోటారు సైకిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిని ఎర్రచందనం విలువ దాదాపు రూ.30లక్షలు ఉండవచ్చునని తెలిపారు. సీఐలు చంద్రశేఖర్, బాలకృష్ణ కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా కుమారధార తీర్థ ముక్కోటి


కుమారధార లోయ, (ఇన్‌సెట్) కుమారధార క్షేత్రంలో వెలసిన కుమారస్వామి


కుమారధార తీర్థం వద్ద టీటీడీ బోర్డు చైర్మన్ సతీమణి స్వర్ణలతారెడ్డి

తిరుమలతో మంగళవారం ఘనంగా కుమారధార తీర్థ ముక్కోటి నిర్వహించారు. ఈ సందర్భంగా తీర్థానికి విచ్చేసిన భక్తులకు శ్రీవారి సేవకులు అన్నప్రసాదాలను అందించారు. టీటీడీ విజిలెన్స్, పోలీస్, అటవీ విభాగాలు సమన్వయంతో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ప్రకృతి సౌందర్యాల నడుమ తీర్థముక్కోటిని భక్తులు దర్శించి పులకించారు.

- తిరుమల

### లింగ వివక్ష నిర్మూలనే లక్ష్యం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి తదితరులు

తిరుపతి అర్బన్ : సమాజంలో ప్రతిఒక్కరూ లింగ వివక్ష నిర్మూలనే లక్ష్యంగా కృషి చేయాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించే దిశగా ముందడుగు వేయాలని సూచించారు. పాశ్చాత్యుల పాలనలో లింగ విభేదాలు తలెత్తాయని తెలిపారు. స్వాతంత్రం తర్వాత మహిళలకు సమాన అవకాశాలతో పాటు, ప్రాథమిక హక్కులు కల్పిస్తూ ఆర్టికల్ 14, 15, 16, ఆదేశ సూత్రాలను రాజ్యాంగంలో పొందుపరిచారని వివరించారు. అందులో భాగంగానే వరకట్నం, బాల్య వివాహాలు, భ్రూణహత్యలను నిషేధించారని చెప్పారు. బాలికా విద్యను ప్రోత్సహించడానికే ప్రభుత్వం అనేక పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు ఏర్పాటు చేసిందన్నారు. ఆడపిల్లల్లో పోరాట పటిమ పెంపొందించేలా తల్లితండ్రులు ప్రోత్సహించాలని కోరారు. జిల్లా మహిళ రాధాదేవి పోరాటంతోనే టీటీడీలో మహిళలు క్షురకులుగా అవకాశం పొందారని గుర్తుచేశారు. డీఆర్‌ఓ శ్రీనివాస రావు మాట్లాడుతూ మహిళల సంక్షేమానికి రాష్ట్రంలో అనేక పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన మహిళా ఉద్యోగులు, పొదుపు సంఘాల సభ్యులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ జ్యోతి, మెప్మా పీడీ రాధమ్మ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జయలక్ష్మి, డీఎంహెచ్‌ఓ శ్రీహరి, డీఆర్‌డీఏ అసిస్టెంట్ పీడీ ప్రభావతి, పాల్గొన్నారు.

# ఏకం.. భక్తులు మమేకం


భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న కృష్ణాజీ, ప్రీతాజీ దంపతులు


భగవాన్ జన్మదిన వేడుకలకు హాజరైన భక్తజన సందోహం

● ఘనంగా కల్కి భగవాన్ పుట్టినరోజు వేడుకలు

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లంలో ఉన్న ఏకం ఆలయంలో ఆధ్యాత్మిక గురువు కల్కి భగవాన్ 74వ పుట్టిన రోజు వేడుకను ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ సభావేదిక వద్ద వేడుకలకు దేశవిదేశాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. 10ఏళ్ల తర్వాత భగవాన్ దర్శనం ఇవ్వనుండంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా భగవాన్ తనయుడు కృష్ణాజీ, ప్రీతాజీ మాట్లాడుతూ 1989 నుంచి కల్కి భగవాన్ ప్రస్థానం ప్రారంభమైందని, లక్షలాది మంది భక్తులకు మార్గనిర్దేశకులయ్యారని తెలిపారు. భగవాన్ జన్మదినాన్ని వరల్డ్ ఒన్నెస్ డేగా జరుపుకుంటున్నట్లు వెల్లడించారు. ఏకత్వంతో ప్రపంచంలో ఉన్న ప్రతి సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. తద్వారా అందరూ సంతోషంగా ఉంటారన్నారు. కరుణతో కూడిన మనస్సు ఉన్నప్పుడే ప్రపంచంలో మనుషుల మధ్య ఐక్యమత్యం, ప్రేమానురాగాలు ఉంటాయన్నారు. చివరగా అర్థరాత్రి 12 గంటల పైబడి భగవాన్ దర్శనం, అనుగ్రహ దీక్ష, ప్రసంగం చేయనుండడంతో భక్తులు ఉత్కంఠతో వేచి ఉన్నారు. ఈ వేడుకలకు రాజకీయ, వ్యాపార, సినీ రంగ ప్రముఖులు హాజరవడం విశేషం. అలాగే శ్రీసిటీ డీఎస్పీ జగదీష్ నాయక్, సీఐలు శ్రీనివాసులు, శివకుమార్ రెడ్డి, ఎస్ఐలు నాగార్జునరెడ్డి, హనుమంతప్ప భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఆచార్య ఆనందగిరిజీ, లోకా ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ లోకేష్ దాసాజీ, జనరల్ మేనేజర్ సునీల్ దాసాజీ, ప్రతినిధి ఉమాపతి దాసాజీ, రుద్ర దాసాజీలు భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# శోభకృత్ నామ సంవత్సర పంచాంగం విడుదల


పంచాంగం విడుదల చేస్తున్న టీటీడీ ఈఓ, జేఈఓలు, పీఆర్‌ఓ

తిరుపతి అలిపిరి: టీటీడీ ముద్రించిన శ్రీశోభకృత్ నామ సంవత్సర పంచాంగాన్ని ఈఓ ఏవీ ధర్మారెడ్డి మంగళవారం తన కార్యాలయంలో విడుదల చేశారు. బుధవారం నుంచి తిరుమలలో రూ.75 చెల్లించి భక్తులు వీటిని కొనుగోలు చేయవచ్చని తెలిపారు. జేఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, ఎఫ్ఎసీఏఓ బాలాజీ, పీఆర్వో డాక్టర్ రవి, ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి రామరాజు పాల్గొన్నారు.

# ‘గగన్‌యాన్’ పారాచూట్‌ల ప్రయోగాత్మక పరీక్ష విజయవంతం


పారాచూట్‌ల పరీక్షలను నిర్వహిస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలు

సూళ్లూరుపేట: ఇస్రో ప్రతిష్టాత్మకంగా 2024లో చేపట్టనున్న గగన్‌యాన్ ప్రాజెక్టు కోసం 2 పారాచూట్‌ల్లో ప్రయోగాత్మక పరీక్షను విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో విజయవంతంగా నిర్వహించినట్లు ఇస్రో తెలిపింది. గగన్‌యాన్ ప్రాజెక్ట్‌లో భాగంగా మానవ సహిత ప్రయోగాన్ని చేయడానికి అనేక ప్రయోగాత్మక పరీక్షలను చేస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఇస్రో చండీగఢ్ బాలిస్టిక్ రీసెర్చి లేబొరేటరీ (టీబీఆర్ఎల్)లో గగన్‌యాన్ పైలట్ అపెక్స్ కవర్ సెపరేషన్ (ఏసీఎస్) పారాచూట్‌ల రైల్‌ట్రాక్ రాకెట్ స్లైడ్ విస్తరణ పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. గగన్‌యాన్ ప్రయోగానికి ముందుగా క్రూ మాడ్యూల్ (వ్యోమగాముల గది)తో ప్రయోగాత్మకంగా ఒక ప్రయోగాన్ని నిర్వహించనుంది. ఇందులో క్రూ మాడ్యూల్‌ను సురక్షితంగా భూమి వైపునకు తీసుకొచ్చేందుకు ఈ పారాచూట్‌లను అమర్చుతారు. వీటి పనితీరు ఎలా ఉంటుంది అనే దానిపై ప్రయోగాత్మకంగా ఒక పరీక్షను ఇస్రో నిర్వహించి విజయాన్ని అందుకుంది.